
www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 3 జూన్ 2023

5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





ఘనంగా గంధమహోత్సవం

ప్రజాశక్తి-గుడ్లూరు: మండలంలోని తెట్టులో సయ్యద్ సుల్తాన్ బీబీ దర్గా ఆవరణలో 131వ గంధ మహోత్సవం గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ఘనంగా గంథోత్సవం జరిగింది. ఈ సందర్భంగా దర్గాని వేలాదిమంది భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దర్గా ఆవరణలో గంథం పంపిణీ చేశారు. గంధ మహోత్సవం సందర్భంగా పాటకచ్చేరి భక్తులను అలరించాయి.ముస్లిములతో హిందువులు కూడా భారీ ఎత్తున తరలి రావడంతో ఈ దర్గా ఆవరణ కళకళలాడింది. భక్తులతో విద్యుత్ దీప అలంకరణ ఆకట్టుకుంది. భక్తులు ఉపహాసం ఉండి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ సుబ్బారావు ఆధ్వర్యంలో శాంతి భద్రతలు పర్యవేక్షించారు.



'జగనన్న'కు కాదు..అధికారులకు 'చెబుదాం'..!

- మండలాల్లోనే అధికారులకు చెప్పాలి
- స్పందన స్థానే జగనన్న పథకం
- నిరుత్సాహంలో ప్రజలు

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన "జగన్నకు చెబుదాం" పథకం పాత చింత కాయ పచ్చడిగా మారిపోతుంది.. ప్రజలకు తమ కష్టాలను, ఇబ్బందు లను ఎప్పటి నుంచో స్థానికంగా విఆర్ఒ, తహశీల్దా రులు, ఆర్‌డిఒ, జెసి, కలెక్టర్ వరకు చెప్పుకుంటూ వస్తున్నారు. కింద స్థాయిలో పరిష్కారం కాకపోతే కలెక్టర్ వద్దకు వచ్చి తమ గోడు చెప్పుకుంటున్నారు. వాటిలో కొన్ని పరిష్కారం అవుతుండగా, మరికొన్ని అలాగే ఉండి పోతున్నాయి. ఈ నేపథ్యంలో మే 9న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి జగనన్నకు చెబుదాం పథకాన్ని తీసుకొచ్చారు. సరైన స్పందన కనిపించడం లేదంటూ విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులు నిర్వహిస్తున్న స్పందన స్థానంలోనే మండలాల్లో ప్రజలు చెప్పుకోవచ్చునని చెప్పడంతో ప్రజల్లో నిరుత్సాహం కనిపిస్తుంది. ముఖ్యమంత్రికి చెబితే ఏదో జరుగుతుందని భావించిన ప్రజలకు ఈ నిర్ణయం మింగుడుపడడం లేదు.



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ (ఫైల్)

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ప్రజలకు అధికారులు జాబితరంగా ఉండాలి. స్థానికంగా ఉండే వ్యక్తిగత, సామాజిక సమస్యలను చెబుతున్నారు. జిల్లాలో ప్రధానంగా పింఛన్, రేషన్‌కార్డు, ఇంటి స్థలం, హౌసింగ్ రుణం, తాగు, సాగునీరు, భూ సమస్యలు ప్రధానంగా ఉంటున్నాయి. ఇవన్నీ గ్రామాలు, కాకపోతే మండలాల్లోనే పరిష్కారించుకోవాల్సి ఉంటుంది. అన్ని సమస్యలు డబ్బుతో ముడిపడడంతో ఎక్కువ మందికి సమస్యలు పరిష్కారం కావడం లేదు. ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండక పోతుండడంతో రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితులుండేవి. జనం ఎప్పుడు వెళ్లినా అక్కడ మీటింగ్, ఇక్కడ మీటింగ్, ఊర్లో లేరు అనే సమాధానాలు జనాలకు వచ్చేవి. వీటిని గుర్తించిన ప్రభుత్వం ప్రతి సోమవారం " స్పందన "గా మార్పు చేశారు. అదికారులందరూ ప్రతి సోమవారం ఉదయం ప్రజలకు అందుబాటులో ఉండేలా దీనిని తీర్చిదిద్దారు. గ్రామ, మండల స్థాయిలో పరిష్కారాని కాని సమస్యలను జిల్లా కేంద్రానికి తీసుకొచ్చే వారు. కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు అర్జీలు సమర్పించేవారు. జిల్లా స్థాయి అధికారులు ఇక్కడే అందుబాటులో ఉండేలా చేశారు. ప్రజలకు జవాబు తనంగా ఉండేలా ప్రతి అర్జీదారులకు రసీదు ఇచ్చి సమస్య వివరాలు చెప్పేవారు. గతంలో తడ నుంచి ఉదయగిరి, సీతారామపురం, కావలి తదితర సుధూర ప్రాంతాల నుంచి పనులు వదులుకొని, ఛార్జీలు పెట్టుకొని జిల్లా కేంద్రానికి తిరిగే వారు. ఇందులో కొన్ని సమస్యలు పరిష్కారం అవుతుండగా, ఎక్కువ భాగం ఎటూ కాకుండా ఉండి పోయేవి. రెవెన్యూతోపాటు, పోలీసు శాఖలో స్పందనకు మంచి స్పందన వచ్చేవి. కొందరు తమ సమస్యల పరిష్కా రం కోసం నెలల తరబడి ఆఫీసులు చుట్టూ తిరిగే పరిస్థితులుండేవి..

జగనన్నకు కాదు..మండలాల్లో చెప్పండి..!


రాష్ట్రంలో పరిష్కారం కాకుండా ఉన్న సమస్యలను నేరుగా ముఖ్యమంత్రి కార్యాయాలనికి చెబితే మీ సమస్యలు పరిష్కారం అవుతాయనే చెప్పారు. మే 9న "జగనన్నకు చెబుదాం" అంటూ కార్యక్రమం ప్రారంభించారు. తొలి నుంచి దీనికి పెద్దగా స్పందన కనిపించడం లేదు. 1902కి ఫోన్ చేసినా సరైనా స్పందన రావడం లేదని ప్రజల్లో ఆగ్రహం ఉంది. ప్రజలు ఇబ్బందులు చెప్పినా అవి మళ్లీ కలెక్టర్, కింద స్థాయికే వెళుతున్నాయి. అవి కూడా గతంలో అధికారులకు చెప్పిన సమస్యలు కావడం విశేషం. నేరుగా జగనన్నకు చెబుదాంకు ఫోన్ చేస్తే న్యాయం జరుగుతుందని భావించిన ప్రజలకు ఇది పెద్దగా న్యాయం జరిగేలా కనిపించలేదని తెలిసింది. సామాజిక సమస్యలు కాకుండా వ్యక్తిగత సమస్యలు చెప్పుకోవాలని చెప్పారు. దీనికి ఎప్పుడైనా ఫిర్యాదు చేయొచ్చు. ఇప్పుడు దీనిని పక్కన పెట్టి పాత పద్దతికే వచ్చినట్లు తెలుస్తోంది. జగనన్న కు చెబుదాం కార్యక్రమం స్థానంలో ప్రతి సోమవారం జరిగే స్పందనకు ఉపయోగించుకోవాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 5 వ తేదీ జిల్లాలోని 37 కేంద్రాల్లో తహశీల్దారులు, ఎంపిడిఒ కార్యాలయాల్లో నేరుగా ప్రజలు వెళ్లి అధికారులకు అర్జీలు ఇవ్వొచ్చునని తెలిపారు. అక్కడ సమస్యలకు పరిష్కారం దొరకడం లేదని, కలెక్టర్‌కు వద్దకు వెళ్లామని, ఇప్పుడు జగన్‌కు చెబితే న్యాయం జరుగుతుందని భావిస్తుంటే మళ్లీ అక్కడికే వెళ్లి చెప్పాలని చెప్పడం వల్ల పెద్దగా ఉపయోగం లేదంటున్నారు ప్రజలు. సోమవారం స్పందనలో జగనన్నకు చెబుదాం అంటున్న అదికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.

వ్యాన్ డ్రైవర్ సజీవ దహనం

ప్రజాశక్తి–కందుకూరు: మండలంలోని ఓగూరు వద్ద విషాదం నెలకొంది. శుక్రవారం తెల్లవారుజామున సంగం డెయిరీ పాల వ్యాను అదుపుతప్పి చింతచెట్టును ఢీకొట్టింది. దీంతో వాహనం నుంచి ఒక్కసారిగా మంటలు చేలరేగి డ్రైవర్ సాయి సజీవదహనం అయ్యాడు.పోలీసుల సమాచారంమేరకు.. కందుకూరు నుంచి సింగరాయకొండ వైపునకు పాల వ్యాను వెళుతున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న కందుకూరు సిఐ వెంకట్రావు, ఎస్ఐ శివ నాంచారయ్య ఘటనపై ఆరా తీస్తున్నారు. సజీవ దహనమైన సాయి మృతదేహన్ని స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు.

టి.బి నివారణకు కృషి

ప్రజాశక్తి-నెల్లూరు: వైద్య, ఆరోగ్య సిబ్బంది సమిష్టి కృషితో విధులు నిర్వహించడం ద్వారా జిల్లాను టి.బి.రహితంగా రూపొందించి భావితరాల వారికి అందజేయాలని ఇన్‌ఛార్జి డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ జి.వెంకటప్రసాద్ పిలుపు నిచ్చారు. శుక్రవారం ఆయన నారాయణ స్పెషాలిటీ వైద్యశాలను సందర్శించి ఆ వైద్యశాలలో నమోదైన టి.బి కేసుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆ వైద్యశాల సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ టి.బి. వ్యాధి నివారణకు ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు విడుదల చేసిందన్నారు. నాణ్యత కలిగిన మందులు రోగులకు అందజేయడంతోపాటు పౌష్టికాహారం కోసం ప్రతి నెలా నగదు అందజేస్తుందన్నారు. నారాయణ వైద్యశాలలో గడిచిన మూడు నెలల్లో 500 మంది గళ్ల పరీక్షలు నిర్వహించుకోగా 30 మందికి మాత్రమే టి.బి నిర్ధారణ అయిందన్నారు. టి.బి వ్యాధి గ్రస్తులను గుర్తించి వారి సమాచారం జిల్లా కేంద్రానికి అందజేస్తున్న ప్రతి వైద్యుడికి ప్రభుత్వం ప్రోత్సహం కింద రూ.500 అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్, విజయకుమార్, నర్సింహులు, నారాయణ వైద్యశాల సూపరిండిండెంట్ డాక్టర్ హరిప్రసాద్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.



'ముప్పరాజు'కు డాక్టరేట్

ప్రజాశక్తి-గుడ్లూరు: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం గ్రంథాలయ, సమాచార శాస్త్ర విభాగంలో ఒప్పంద అధ్యాపకునిగా పనిచేస్తున్న గుడ్లూరు గ్రామానికి చెందిన ముప్పరాజు కిషోర్ బాబుకి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి తెలిపారు. ఈయన "సెలక్టెడ్ వెబ్ రిసోర్సెస్ ఇన్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ ఎ స్టడీ అనే అంశంపై ఎస్‌వి యూనివర్సిటీ ఆచార్యులు డాక్టర్ కొంగర సురేంద్రబాబు పర్యవేక్షణలో తన సిద్ధాంత వ్యాసాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించారు.

వైసిపి ఓట్ల దాహానికి రెండు ప్రాణాలు బలి

- భగత్‌సింగ్ కాలనీ ఘటనను సుమోటోగా స్వీకరించాలి
- కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలి

ప్రజాశక్తి-నెల్లూరు

పెన్నానది పరివాహక ప్రాంతంలో రివిట్‌మెంట్ వాల్ నిర్మాణానికి ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు వర్క్ ఆర్డర్, ఫైనాన్స్ క్లియరెన్స్ ఇస్తూ ఉత్తర్వులు అందజేయకుండా పనులు ప్రారంభించడాన్ని పరిశీలిస్తే ఇదంతా కేవలం ఎన్నికల స్టంట్ కోసమే అని, వైసిపి ఓట్ల దాహానికి రెండు ప్రాణాలను బలిగా తీసుకుందని టిడిపి, సిపిఎం నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఇరిగేషన్ శాఖ కార్యాలయానికి చేరుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, టిడిపి నగర ఇన్‌ఛార్జి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి పలువురు నాయకులు స్థానిక 54వ డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్ కాలనీ ప్రాంతంలో రెండు రోజుల క్రితం చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి వివరణ ఇవ్వాలని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. సిపిఎం, టిడిపి నాయకులు ఇరిగేషన్ శాఖ అధికారులను అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పలేక పొంత లేకుండా సమాదానం చెప్పారు. దీంతో ఆగ్రహించిన నాయకులు మాట్లాడుతూ వంద కోట్ల ఖర్చుతో ఈ పనులు జరుగుతున్న ప్రాంతంలో ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకుండా, ప్రమాదాల నివారణకు ఎటువంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. పనులు జరుగుతున్న సమయంలో తనిఖీలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏఈని, సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలి, వారిపై హత్యా కేసు నమోదు చేయాలన్నారు. నిర్మాణ పనుల నిమిత్తం కాంట్రాక్టర్ తీసిన గుంతలో పడిపోయిన ఇద్దరు చిన్నారుల ప్రాణాలను కాపాడే ప్రయత్నంలో ఇద్దరు తల్లులు ప్రాణాలు కోల్పోవడం దారుణమన్నారు. ఈ ఘటన చోటు చేసుకొని రెండు రోజులు పూర్తి కావస్తున్నప్పటికీ ప్రభుత్వ అధికారులు బాధిత కుటుంబాలను పరామర్శించిన దాఖలాలు లేవన్నారు. శాసనసభ్యులు అనిల్‌కుమార్ పర్యటించిన సమయంలో పెన్నానది పరివాహక ప్రాంతంలో రివిట్‌మెంట్ నిర్మించేందుకు శాయిల్ పరీక్షలు నిర్వహించేందుకు మాత్రమే గుంటలు తీయడం జరిగిందని పెర్కొన్నారన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, ఎం.మోహన్‌రావులు మాట్లాడుతూ ఈ ఘటనలో బాధితులైన ఒకొక్క కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియాగా రూ.50 లక్షలు అందజేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం నగర కార్యదర్శికత్తి శ్రీనివాసులు, టిడిపి నగర అధ్యక్షులు మామిడాల మధులు మాట్లాడుతూ పెన్నానది వరద ప్రవాహం వల్ల పరివాహక ప్రజలకు జరిగే నష్టాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం చేపట్టిన పెన్నానది రివిట్‌మెంట్ నిర్మాణ పనులు సుమారు రూ.100 కోట్ల వ్యయంతో సిఎం శంకుస్థాపన చేశారన్నారు. రెండు సంవత్సరాల క్రితం శంకుస్థాపన చేస్తే నేటి వరకు పనులు ప్రారంభించలేదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైసిపి ప్రభుత్వం చెసిన వాగ్దానం అమలు చేయలేదన్నారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి యుద్ద ప్రాతిపదికన విచారణ కమిటీని వేయాలని డిమాండ్ చేశారు. స్పష్టంగా విచారణ చేసి పేదల ప్రాణాలను బలితీసుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఘటన జరిగిన రోజున అర్ధరాత్రి వరకు స్థానికులు ఆందోళన చేస్తే డిఎస్‌పి, ఆర్‌డిఒ వచ్చి బాధిత కుటుంబాలకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. విచారణ చేస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేసినట్లు కనిపించడం లేదన్నారు. అధికార పార్టీ నాయకుల జోక్యంతో చివరకు పోలీసు స్టేషన్‌లోని ఎఫ్ఐఆర్ ను సైతం తారుమారు చేసి రిపోర్టు రాసే పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. భాదిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా వారం రోజుల్లోగా అందజేయకపోతే సిపిఎం, టిడిపి ఆధ్వర్యంలో ఇరిగేషన్ శాఖ కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.నాగేశ్వరరావు, కాయం శ్రీనివాసులు, టిడిపి నాయకులు కువ్వారపు బాలాజీ, పిట్టి సత్యనాగేశ్వరరావు, ఉచ్చి భువనేశ్వరప్రసాద్, కాకర్ల తిరుమల నాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

ఎంఎన్‌సి ఉద్యోగాలకు 50 మంది 'ప్రకాశం' విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-కందుకూరు: ఉద్యోగ నియామకాల సంక్షోభవేళ పలువురు ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు మల్టీ నేషనల్ ఎంఎన్‌సిలకు ఎంపికై రికార్డు సృష్టించారని టెక్నికల్ డైరెక్టరు కె.విజయ్ శ్రీనివాస్ వెల్లడించారు. టిసిఎస్, విప్రో, హెక్సా వేర్ తదితర కంపెనీలు ఆన్ లైన్ ద్వారా నిర్వహించిన పరీక్షలు, ఇంటర్వ్యూలలో 50 మందికి పైగా విద్యార్థులు ఆఫర్ లెటర్స్ పొందగలిగారని పేర్కొన్నారు. ఎంపికైన వారిలో రెండు లక్షల నుంచి ఏడు లక్షల వరకు వార్షిక వేతనం పొందనున్నారని విజయ్ వివరించారు. వచ్చేవారం విప్రో క్యాంపస్ ఇంటర్వ్యూ నిర్వహణకు ఆమోదించినట్లు తెలిపారు. గ్లోబల్ యుఎస్ టెక్నాలజీస్‌కు ఎంపికైన కాశయ్య వార్షిక వేతనం రూ.7 లక్షలని డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మెకానికల్ బ్రాంచి నుంచి యుఎస్ టెక్నాలజీకి ఎంపిక కావడం పట్ల హెచ్ఒడి జివి పున్నారావు హర్షం వ్యక్తం చేశారు. ఎంతటి సంక్షోభ సమయంలోనైనా తమ కాలేజీ విద్యార్థులు ఎంఎన్‌సిలకు ఎంపికయ్యేందుకు అవసరమైన సాంకేతిక శిక్షణ నిరంతరం ఇవ్వడం ఇందులో విజయ రహస్యమన్నారు. టెక్నికల్ డైరెక్టరు విశ్వాసం గత సంవత్సరం సుమారు 400 మంది ఎంఎన్‌సిలకు ఎంపికయ్యారని తెలిపారు. అదే బాటలో డిగ్రీతో పాటు ఆఫర్ లెటర్ అభయాన్ని ప్రకాశం సాధిస్తుందని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు.



టెక్నికల్ డైరెక్టరు కె విజయ్

దేవాలయానికి విరాళం

ప్రజాశక్తి-కందుకూరు: కందుకూరు శ్రీ అంకమ్మ తల్లి దేవాలయం పున:నిర్మాణం కోసం ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి సారధ్యంలో, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో పనులు శర వేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే పిలుపుమేరకు భక్తులు తమ శక్తి కొలది ఆలయ పున: నిర్మాణానికి విరాళాల ను సమర్పిస్తున్నారు. శుక్రవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి సమక్షంలో విశ్రాంత హౌసింగ్ డిఇ పావులూరి నాగేశ్వరరావు, భార్య పద్మజ, కుమారుడు పవన్ కుమార్ రూ.25,116 నగదును కమిటీ సభ్యులు కొండూరి వసంతరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహీధర్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో పున: నిర్మాణం జరుగుతున్న శ్రీ అంకమ్మ తల్లి ఆలయాన్ని సుందరంగా తీర్చి దిద్దడానికి ఇప్పటివరకు అనేక మంది దాతలు భాగస్వాములైనందుకు వారికి హదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఆలయ పున: నిర్మాణంలో తాము భాగస్వాములవుతామని పావులూరి నాగేశ్వరరావు ధర్మపత్ని పద్మజ, కుమారుడు పవన్ కుమార్ లు రూ. 25,116 నగదును విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి చైర్మన్ తోకల కొండయ్య, సూరం వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు..



విరాళం అందజేస్తున్న దాత

ధ్యానంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-కందుకూరు: కోటారెడ్డి నగర్‌లో 40 రోజుల నుంచి పిరమిడ్ ధ్యానం క్లాసులు జరుగుతున్నాయి. అందులో భాగంగా బివి రమణ సీనియర్ పిరమిడ్ మాస్టర్ యోగా మాస్టర్ వరుసగా ఐదు రోజులు ధ్యానం క్లాసు గురించి ఉపన్యాసం ఇచ్చారు. ధ్యానం సకల రోగ నివారిణి ధ్యానం సకల జ్ఞానప్రదాయని సకల సంపదప్రదాయని, మనసు ఆలోచనలు కోరికలు ఆశ ఈ నాలుగు ధ్యానం ద్వారా జయించి మానసిక ఒత్తిడి తగ్గించుకుంటారు.అనంతరం బివి రమణను ధ్యాన మిత్రులు సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్ రాము, తదితరులు పాల్గొన్నారు.



హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి-వలేటివారిపాలెం: మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు కార్యక్రమం శుక్రవారం కొండపై అన్నదాన భవనంలో జరిగింది. 13 శనివారాలకు సంబంధించి హుండీలన్నీ లెక్కించగా, రూ. 1,13,68,261 ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ కెబి శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా బంగారం 248 గ్రాములు, వెండి 2.04 గ్రాములు, విదేశీ కరెన్సీ యుఎస్ డాలర్లు 118, ఇంగ్లండ్ పౌండ్స్ 95, సౌత్ఆఫ్రికా 100, ఆస్ట్రేలియా 5, సింగపూర్ 2 డాలర్లు వచ్చాయి. హుండీల లెక్కింపును కందుకూరు దేవాలయ అధికారి బైరాగిచౌదరి పర్యవేక్షించారు. కందుకూరు డిఎస్‌పి రామచంద్ర, వివిపాలెం ఎస్ఐ మహేంద్ర పరిశీలించారు. లెక్కింపులో సిబ్బంది పాల్గొన్నారు.




నగదును లెక్కిస్తున్న దృశ్యం

సచివాలయంలో కమిషనర్ తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు: నగర పాలక సంస్థ పరిధిలోని స్థానిక 19/1 ,19/2 రామలింగాపురం వార్డు సచివాలయాన్ని కమిషనర్ వికాస్ మర్మత్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలోని ఇన్స్పెక్షన్ రిజిష్టరు, నోటీసు బోర్డు, హాజరు రిజిస్టరు, స్పందన రిజిష్టరులతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. పెండింగులోని సేవలను గడువులోపు పూర్తి చేయాలని, సాంకేతిక అంశాలపై కార్యాలయం నుంచి నేరుగా సూచనలు పొందాలని కార్యదర్శులకు కమిషనర్ సూచించారు. ఎస్.డి.జి సర్వే, భూహక్కు సర్వే, ఎ.పి సేవా పోర్టల్ అంశాలపై ప్రత్యేక దష్టి సారించి, సూచించిన యాక్షన్ ప్లాన్ ను అమలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ వివిధ విభాగాల అధికారులు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

పాదరక్షలు పంపిణీ

ప్రజాశక్తి -కందుకూరు: పట్టణంలో మండుతున్న ఎండ తీవ్రంగా ఉండడంతో శుక్రవారం దాత సహాయంతో వద్ధులు, పిల్లలకి మజ్జిగ ప్యాకెట్లతో పాటు చెప్పులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రెసిడెంట్ సాజిద్, సెక్రటరీ షంషేర్, ట్రెజరర్ హాఫీజ్, ఇన్‌ఛార్జ్ అయూబ్ ఖాన్ పఠాన్, షంషుద్దీన్ పాల్గొన్నారు.



పాదరక్షలు అందజేస్తున్న దాత

ప్రత్యేక మేళాలు నిర్వహించాలి

ప్రజాశక్తి-నెల్లూరు:

నిర్మాణాలు పూర్తయిన గృహాలకు విద్యుత్ సదుపాయాలు వెంటనే కల్పించాలని అధికారులను నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. కార్పొరేషన్ లోని కమిషనర్ కార్యాలయంలో టిడ్కో విభాగం, విద్యుత్ శాఖ, నగర పాలక సంస్థ అధికారులు, మెప్మా విభాగం అధికారులతో సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నవరత్నాలు పథకంలో భాగంగా పేదలకు అందిస్తున్న గృహాల పట్ల ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని తెలిపారు. మెప్మా విభాగం అధికారులతో సమన్వయం చేసుకుంటూ, లబ్ధిదారుల రుణాల మంజూరు ప్రక్రియకు ప్రత్యేక మేళాలు నిర్వహించాలని సూచించారు. రుణాలు మంజూరైన లబ్ధిదారుల గృహాలను వేగంగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన యాక్షన్ ప్లాన్ ను అధికారులంతా పటిష్టంగా అమలు చేస్తే గహ రుణాల లక్ష్యాలను సాధించగలమన్నారు. విద్యుత్తు, వీధి దీపాలు, మంచినీరు, డ్రైన్లు, రోడ్డు మార్గాలు వంటి మౌలిక సదుపాయాలను టిడ్కో గృహ సముదాయాలకు కల్పించి లబ్ధిదారులకు గృహాలను కేటాయించాలని సూచించారు.ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్.ఈ, ఈ.ఈ లు, టిడ్కో ఈ.ఈ, మెప్మా విభాగం అధికారులు, నగర పాలక సంస్థ టి.పి.ఆర్.ఓ ప్రసాద్, హౌసింగ్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



తోపుడు బండ్లు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు: పట్టణంలోని 6వ వార్డుకు చెందిన పేదలైన సయ్యద్ చాంద్ బాషా, షేక్ బీబ్ జాన్‌లు చిరువ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు వారిద్దరికీ శుక్రవారం తోపుడు బండ్లు అందజేశారు. చిరువ్యాపారులు, పేదలు స్వశక్తితో ఆర్థికంగా నిలదొక్కు కునేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఇద్దరూ నాగేశ్వరరావుకి కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, పట్టణ మాజీ అధ్యక్షులు కంద్రా మాల్యాద్రి, పట్టణ మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ సలాం, నియోజకవర్గ ముస్లిం మైనారిటీ ఉపాధ్యక్షులు షేక్ ఫిరోజ్, నియోజకవర్గ ఐటీడీపీ కో–ఆర్డినేటర్ షేక్ మున్నా, వేముల ప్రసాద్ పాల్గొన్నారు.


పారదర్శకంగా బదిలీల ప్రక్రియ

ప్రజాశక్తి-నెల్లూరు: జిల్లా పోలీసుల సాదారణ బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామని ఎస్‌పి డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఎస్‌పి కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన బదిలీల ప్రక్రియలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సంక్షేమానికి ఎల్లప్పుడూ తాను కృషి చేస్తామన్నారు. 5 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న కానిస్టేబుల్ నుండి ఏఎస్ఐ స్థాయి వరకు బదిలీ ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 5 సబ్ డివిజన్ లోని 19 మంది ఏఎస్ఐలు, 47 మంది హెడ్ కానిస్టేబుల్స్, 94 మంది కానిస్టేబుల్స్ (160 మందిని) బదిలీ చేశామన్నారు. ముందుగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ఖాళీలను ప్రొజెక్టర్ పై ప్రదర్శింపచేసి సీనియార్టీ ప్రకారం నిబంధనలు అనుసరించి బదిలీ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో పారదర్శకతతో, నిబంధనలే ప్రామాణికాలుగా తీసుకుని సీనియార్టీ ఆధారంగా సిబ్బంది కోరుకున్న చోటుకే ఖాళీల ఆధారంగా సిబ్బందికి స్థాన చలనం కలిగిందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ యస్.పి.(అడ్మిన్) , ఇతర అధికారులు, సంబంధిత డిపిఒ సిబ్బంది పాల్గొన్నారు.

టిడ్కో గృహాలకు తక్షణమే విద్యుత్ సదుపాయం

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో నిర్మాణాలు పూర్తయిన టిడ్కో గృహాలకు తక్షణమే విద్యుత్ సదుపాయం కల్పించాలని సంబంధిత అధికారులకు జిల్లా పర్యవేక్షక ఇంజినీర్ బి.వెంకటసుబ్బయ్య ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం ఆయన విద్యుత్ భవన్ లో జిల్లాలోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్స్ తో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఇ మాట్లాడుతూ ప్రతి డివిజన్లో సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ ను చేయాలని, సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ అవసరమైన సామగ్రి మొత్తం ఇప్పటికే అందజేశామన్నారు. ప్రతి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తమ పరిధిలోని సబ్ స్టేషన్స్ మెయింటినెన్స్ విధిగా చేపట్టాలన్నారు. సబ్ స్టేషన్ లో 25 సంవత్సరాలు దాటిన ఎర్త్ ప్లేట్స్ వెంటనే మార్చాలని సముద్రానికి దగ్గరగా ఉండే సబ్ స్టేషన్ లలో యుద్ధ ప్రాతిపదికన వెంటనే మార్చాలని ఆదేశాలు జారీ చేశారు. సబ్ స్టేషన్ మెయింటైన్ చేయకపోతే ఎర్త్ ప్లేట్స్ తుప్పు పట్టి దెబ్బ తింటాయని సూచించారు. వినియోగదారునికి సంతప్తికర సేవలు అందిస్తేనే సంస్థ మనుగడ సాధిస్తుందన్నారు. వినియోదారులు తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కార్యాలయానికి వస్తే సమస్యను ఓపిగ్గా విని అధికారులు ఎటుంటి సేవలు అందించగలో తెలియజేసి సమస్యను పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఎక్కడ విద్యుత్ కోతలు లేవని అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. జిల్లా పరిధిలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని రోజువారి సరాసరి 21 ఎం.యు.లు పెరిగినప్పటికీ డిమాండ్ కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. కేవలం సాంకేతిక సమస్యలతోనే అక్కడక్కడ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయని జిల్లా పరిధిలో ఎక్కడ విద్యుత్ కోతలను అమలు చేయడం లేదని స్పష్టం చేశారు. ఇటీవల ఈదురు గాలులు ,వర్షం కారణంగా ,లైన్లో సాంకేతిక లోపాలు తలెత్తడం వల్ల వాటి మరమ్మత్తుల కారణంగా అప్పుడప్పుడు విద్యుత్ అంతరాయాలు ఏర్పడినట్లు తెలిపారు. ఎస్‌పిడిసిఎల్ ఆదేశాలకు అనుగుణంగా విద్యుత్ వినియోగదారులకు ఎస్ఓపి (స్టాండర్డ్ ఆఫ్ పెర్ఫార్మర్స్) ప్రకారం సేవలందించేందుకు అవసరమైన చర్యలను పటిష్టంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులకు విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం అన్ని డివిజన్లో టోల్ ఫ్రీ నెంబర్స్ ఉన్నాయని లేదా 1912 కు ఫోన్ చేసి తెలుపవచ్చు అని తెలిపారు. డి.టి.ఆర్. ఫెయిల్యూర్స్ ఎక్కువగా ఉన్నవి డి టి ఆర్ ఫెయిల్యూర్ పై ప్రతి అధికారి మానిటరింగ్ చేయాలని డి టి ఆర్ ఫెయిల్యూర్ తగ్గించకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ పథకాలు అయినటువంటి జగనన్న కాలనీలకు , గడపగడపకు మన ప్రభుత్వం లలో వచ్చిన ఫిర్యాదులను మొదటి ప్రాధాన్యత గా పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. కోర్ట్ కేసులు ఉంటే వెంటనే వాటికి సంబంధించి లీగల్ సెల్ వారిని సంప్రదించి కౌంటర్ లను వెంటనే వేయాలని తెలిపారు. ముఖ్యంగా బిల్ స్టాప్ సర్వీసులను తనిఖీ చేయాలని తెలిపారు మరియు అగ్రికల్చర్ సర్వీసులకు ఆధార్ నెంబరు మరియు మొబైల్ నెంబర్ లింక్ చేయాలన్నారు. విద్యుత్ సిబ్బంది ప్రతి ఒక్కరూ సేఫ్టీ కిట్స్ ధరించి విద్యుత్ పనులను చేయాలని, ప్రతి ఒక్క సెక్షన్ ఆఫీసుకు సేఫ్టీ కిట్స్ పంపిణీ చేశామన్నారు. సిబ్బంది ప్రమాదాల బారిన పడకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో ఎనర్జీ ఆడిట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బెనర్జీ ,ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాఘవేంద్రం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పర్యవేక్షక ఇంజినీర్ బి.వెంకటసుబ్బయ్య

సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-నెల్లూరు: నగర పాలక సంస్థ పరిధిలో స్పందన వేదిక ద్వారా అందుకున్న అపరిష్కృత ప్రజా సమస్యల పరిష్కారానికి కమిషనర్ వికాస్ మర్మత్ క్షేత్ర స్థాయిలో పర్యటించారు. స్థానిక నారాయణరెడ్డి పేట, అరవింద్ నగర్ తదితర ప్రాంతాల్లో స్పందన ఫిర్యాదులను కమిషనర్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన కమిషనర్ ఆక్రమణలపై సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. స్పందన వేదికలో అందుకున్న అన్ని రకాల ఫిర్యాదులను పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.అనంతరం స్థానిక కల్లూరుపల్లిలోని మహావీర్ పశు సంరక్షణ సేవా కేంద్రాన్ని కమిషనర్ సందర్శించారు. కేంద్రంలో సంరక్షణ పొందుతున్న వివిధ రకాల జంతువుల పర్యవేక్షణను పరిశీలించి, వాటి సంరక్షణకు తీసుకుంటున్న జాగ్రత్తలను నిర్వహకులతో మాట్లాడి తెలుసుకున్నారు. సందర్భంగా పశు సంరక్షణశాల కార్యదర్శి ఇందిర, కమిషనర్ ను సత్కరించారు. కార్యక్రమంలో ఎస్.ఇ సంపత్ కుమార్, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ, ఇతర విభాగాల సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

5 నుంచి 'జగనన్నకు చెబుదాం..'

ప్రజాశక్తి-ఉదయగిరి


సోమవారం జరిగే 'జగనన్నకు చెబుదాం' స్పందన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం తహశీల్దారు కార్యాలయంలో ఉదయము 10 గంటల సమావేశం జరుగుతుందని అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. కావున ఉదయగిరి మండలంలోని ప్రజలు సోమవారం ఉదయం 10 గంటలకు తహశీల్దారు కార్యాలయము జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం ప్రారంభమవుతుందని అర్జీలు స్వీకరించబడుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ సద్వియోగం చేసుకొని సమస్యలను అర్జీల రూపములో అందించాలని తక్షణమే సంబంధిత శాఖల అధికారులతో పరిష్కార చర్యలు తీసుకుంటారన్నారు.

ప్రజాశక్తి-దగదర్తి : జగనన్నకు చెబుదాం కార్యక్రమాని స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి తహశీల్దార్ చెంచయ్య ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వము జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం1:30 దాకా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమం ఉద్దేశం ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు వీలుంటుందని ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని వారు తెలిపారు. కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-కావలి

డి.ఆర్.విశ్వోదయ సేవాసమితి ఆధ్వర్యంలో కావలి వెంగళరావు నగర్లోని తమ కార్యాలయంలో 60 మంది నిరుపేద వృద్ధులకు రూ.60 వేలు విలువ చేసే బియ్యం, వంటింటి సరుకులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ రవికాంత్ మాట్లాడుతూ నిరుపేదలైన వృద్ధులకు ప్రతిఒక్కరూ ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో కావలి ఏరియా హాస్పిటల్ చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ హరిత, విశ్వోదయ రెక్టార్ వినయకుమార్‌రెడ్డి, 'సేవాసమితి చైర్పర్సన్ దొడ్ల అనిలక్ష్మి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, జెబి రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు, సభ్యులు టి.రామకృష్ణ, ఎం.నవీన్, ఎం.లక్ష్మీప్రసన్న, సతీష్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.



అధిక నగదు వసూళ్లపై ఫిర్యాదు

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలంలోని నర్రవాడ గ్రామంలో వెలసి ఉన్న శ్రీ వెంగమాంబ దేవస్థానంలో చిరు వ్యాపారస్తులకు సంబంధించి తాత్కాలిక అంగళ్లు దేవస్థానం నిర్ణయించే ధరలే వ్యాపారులకు ఇవ్వాలని శుక్రవారం ఎపి కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం సభ్యులు శ్రీ వెంగమాంబ దేవస్థానం కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఈసీ మెంబర్ చల్లగాలి వెంకట్ మోహన్, నియోజకవర్గం అధ్యక్షులు మాల్యాద్రి నాయుడు, సూర్యనారాయణ, మధు, కృష్ణ, అనిల్, పాల్గొన్నారు.

బాలుడిపై కుక్కదాడి

ప్రజాశక్తి-సంగం

మండల కేంద్రంలోని మసీద్ సెంటర్లో ఎనిమిదేళ్ల బాలుడిపై వీధి కుక్క దాడి చేసిన సంఘటన చోటుచేసుకుంది. వీధిలో బాలుడు ఆడుకుంటుండగా కుక్క ఒక్కసారిగా బాలుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. దాడిలో ఆ బాలుడికి తీవ్ర గాయాలవడంతో తల్లిదండ్రులు స్థానిక హాస్పిటల్‌కి తరలించి చికిత్స అందించారు. వీధిలో కుక్కలు ఎక్కువగా ఉన్నాయని సచివాలయం సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. కుక్కల నియంత్రణ చర్యలు తీసుకోవాలని కోరారు. వీధి లైట్లు లేనందున రాత్రుళ్లు ఇబ్బందిగా ఉందన్నారు.

పనులను పూర్తి చేయాలి

ప్రజాశక్తి-కొడవలూరు

మండలంలోని అసంపూర్తిగా ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిసిఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో అధికారులు నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలలో డ్రైనేజీ సిమెంట్ రోడ్లు విద్యుత్ లైన్ల పనులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు నాయకుల సమన్వయంతో ఆ పనులను త్వరగా పూర్తిచేసే ప్రారంభానికి సిద్ధం చేయాలని తెలిపారు. 5, 6 తేదీలలో గండవరంలో ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నందున అందుకు సంబంధించి సమగ్రంగా సమాచారం సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ పి.సుబ్రహ్మణ్యం, బుచ్చి సిఐ రామారావు, ఆర్డబ్ల్యుఎస్ పిఆర్ ఎఇలు ఎ.రమేష్, తాతారావు ట్రాన్స్‌కో ఏఈ రాములు, వైసిపి మండల కన్వీనర్ గంధం వెంకట శేషయ్య, ఎంపిటిసి పెనాక శ్రీనివాసులు రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జి రాధాకృష్ణ, నాయకులు అడపాల మోహనకృష్ణ, రామిరెడ్డి రాజేష్ రెడ్డి, ఎస్కె ముజీర్, సత్యం పాల్గొన్నారు.



లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు పట్టణ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆత్మకూరు పట్టణంలోని ఆర్యవైశ్య ప్రధాన వీధిలో 50 రోజులుగా నిర్వహిస్తున్న మజ్జిగ, చల్లటి నీటి చలివేంద్రాన్ని నిలిపివేస్తూ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఆత్మకూరు పట్టణంలో తీవ్ర ఎండలు ఉన్న నేపథ్యంలో పట్టణంలో వచ్చే ప్రయాణికులకు పట్టణ ప్రజలకు సౌకర్యార్థం ఆత్మకూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సభ్యులు, పట్టణ ఆర్యవైశ్యులు పట్టణ ప్రధాన వీధిలో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పట్టణ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మెంట శ్రీనివాసులు, సెక్రెటరీ ఓమ్మిని. శ్రీనివాసరావు, ట్రెజరర్ దొర్నాదుల. శ్రీనివాసులు, ఆత్మకూరు లయన్స్ క్లబ్ ఇతర సభ్యుల సహకారంతో 50 రోజులపాటు నిరంతరంగా మజ్జిగ, చల్లని నీటి చలివేంద్రాన్ని లైన్స్ క్లబ్ సభ్యులు, పట్టణంలోని మరికొంతమంది ఆర్యవైశ్యులు కలిసి నిర్వహించారు. చివరి రోజు నిర్వహించిన కార్యక్రమంలో శ్రీ దుర్గా ఉపాసకులు, మహాలా ఏజెన్సీ నిర్వాహకులు శ్రావణ్ కుమార్, వాసు ఆధ్వర్యంలో చల్లటి మజ్జిగతో పాటు జ్యూస్ బాటిల్స్, స్వీట్ బ్రెడ్లు పంచారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి-కలిగిరి

కలిగిరి స్థానిక ఏపి మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశం పొందడానికి 7వ తేదీ చివరి రోజు అని ప్రిన్సిపాల్ ఎ.శ్రీను తెలియజేశారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు ఎస్‌సి ఎస్‌టి వారు రూ.150 రుసుము చెల్లించాల్సి ఉంటుందని, అలాగే బిసి ఒసి వారు రూ.200 రుసుము ఆన్‌లైన్లో చెల్లించాల్సి ఉంటుందన్నారు. గ్రూపుల వారీగా ఎంపిసి, బైపిసి, సిఇసి, ఎంఇసి, రూ.40 చొప్పున మొత్తం 160 మంది ఇంటర్‌లో చేరేందుకు అవకాశం ఉందని తెలియజేశారు. అలాగే 6వ తరగతి ప్రవేశ పరీక్ష 11వ తేదీన మోడల్ స్కూల్ కలిగిరిలో ఉదయం 9గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

పడమటినాయుడుపల్లిలో కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని పడమటి నాయుడు పల్లిలో కలెక్టర్ హరినారాయణన్ శుక్రవారం పర్యటించారు. ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి పడమటి నాయుడు పల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సమయంలో హైలెవల్ కెనాల్ ముంపు బాధితులు తమ సమస్యను తెలపడంతో వెంటనే విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎం హరి నారాయణన్ కలిసి వినతిపత్రం సమర్పించి రైతులకు నష్ట పరిహారం త్వరగా అందించేలా చూడాలని కోరారు. దీంతో స్పందించిన కలెక్టర్ హైలెవల్ కెనాల్ ముంపు బాధితులతో సమావేశమై మాట్లాడి కొందరి భూమికి



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

సంబంధించిన పాసుపుస్తకాలను పరిశీలించారు. కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి కలిసి విన్నవించడంతో తాము బాధితులతో మాట్లాడేందుకు వచ్చామని, త్వరగా భూ నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని, పరిహారం, పునరావాసం, మిగిలిన రెవెన్యూ పనులు సైతం త్వరగా చేపట్టి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని వివరించా రు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్న ఎంఎల్ఎకు గ్రామ రైతులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంత రం కంపసముద్రం సమీపంలో జరుగు తున్న సోమశిల హైలెవెల్ కెనాల్ ఫేజ్ 2 పనులను కలెక్టర్ పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, తెలుగు గంగ స్పెషల్ కలెక్టర్ సువర్ణమ్మ, ఆత్మకూరు ఆర్‌డిఒ కరుణకుమారి, ఇన్‌ఛార్జి తహశీల్దారు ఆనందరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర, అధికారులు పాల్గొన్నారు.

భూనిర్వాసితులను కలిసిన రైతు సంఘం నాయకులు



మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలం పడమటి నాయుడు పల్లిలో సోమశిల హై లెవెల్ కెనాల్లో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులను ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య శుక్రవారం రైతులతో కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు ఉదయగిరి నియోజకవర్గాల్లోని 6 మండలాలకు లక్ష ఎకరాలకు సాగు, తాగునీరు అందించడానికి 2013లో సోమశిల హై లెవెల్ కెనాల్ పనులు ప్రారంభించారు. కానీ ఏ గ్రామాలు మునక ప్రాంతాల కింద ఉన్నాయో అవి అభివృద్ధికి దూరంగా ఉన్నాయన్నారు. అయినా అభివృద్ధి పనులు చేసుకోవాలన్నా, వలసలు వెళ్లాలన్నా కష్టతరంగా ఉందని పేర్కొన్నారు. కాలువ పనులు ఇప్పటికీ నత్తనడకన సాగుతున్నాయన్నారు. అలాగే ప్రజలు వేరే ప్రాంతాలకు వలస వెళ్లేందుకు వీలు లేకుండా పోయిందని వెంటనే ప్రభుత్వం భూ నిర్వాసితుల నష్ట పరిహారం అందించి పనులు త్వరితగతిన చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలు తమ అవసరాల నిమిత్తం, ఈ పథకం కోసం అనివార్య పరిస్థితులలో భూములను ఇవ్వాల్సి వచ్చిందన్నారు. పదేళ్ల క్రితం ఎకరం రూ.20 వేలు భూములు నేడురూ 5నుండి రూ.10 లక్షలు వరకు మార్కెట్ ఉందన్నారు. రాబోవు రోజుల్లో మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. రైతుల భూములను ప్రభుత్వ అవసరాల నిమిత్తం తీసుకునేటప్పుడు రైతులకు నాలుగు రెట్లు అదనంగా ఇవ్వాలని సుప్రీంకోర్టు 2013లో చెప్పిందని పేర్కొన్నారు. ఆచట్టాన్ని అమలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి సయ్యద్ రహమతుల్లా, బాలకొండారెడ్డి చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్

ప్రజాశక్తి-ఉదయగిరి



మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్

మండలంలోని కృష్ణంపల్లి ఆర్లపడియ గ్రామాల్లో జరుగుతున్న భూ రీ సర్వే ప్రక్రియను శుక్రవారం జిల్లా ట్రైనీ కలెక్టర్ విద్యాధరిణి పరిశీలించారు. తహశీల్దార్ కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న రీ సర్వేను పరిశీలించి చేపట్టే సర్వే నిష్పక్షపాసంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సర్వేను వేగవంతం చేయాలని సూచనలు చేశామన్నారు. అనంతరం పట్టణంలోని చక్కనగిసి కేంద్రాన్ని సందర్శించి దాసరి పల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో దాసరపల్లి గ్రామంలో జరుగుతున్న అమృత్ సర్ ప్రాజెక్ట్ కింద చేపట్టే చెరువు అభివృద్ధి పనులను పరిశీలించారు. అలాగే ఉద్యానవన పంటలకు వచ్చిన నష్టపరిహారం అందజేయడానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆత్మకూరు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ నరసింహమూర్తి, తహశీల్దార్ సానా శ్రీనివాసరెడ్డి, ఎపిఒ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ రవి పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు మాలకొండారెడ్డి

ప్రజాశక్తి-కావలి

సాంఘిక సేవచేస్తూ సమాజాన్ని మేల్కొలుపుతున్న మాలకొండారెడ్డి పలువురికి ఆదర్శప్రాయుడని సెంట్రల్ బ్యూరోఆఫ్ కమ్యూనికేషన్ స్టేట్ జాయింట్ డైరెక్టర్ పి.రత్నాకర్ పేర్కొన్నారు. రత్నాకర్ శుక్రవారం విజయవాడ నుండి ముసునూరు గ్రామంలో వారి మిత్రుని నివాసానికి వచ్చిన సందర్భంగా సామాజిక ఉద్యమ కార్యకర్త ఎం.మాలకొండారెడ్డిని అభినందలతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై తమశాఖ సహకారంతో ప్రజలకు అవగా హన కలిపిస్తూ, వారిని చైతన్య పరుస్తున్నారని తెలియజేశారు. ముఖ్యంగా "ఆజాదీ కా అమృత్" మహోత్సవ వేడుకలను గుంటూరు ప్రకాశం జిల్లాలో వివిధ సభల్లో యువతకు విద్యార్థులకు దేశ భక్తిని పెంపొందించటానికి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.

ఎంపిడిఒ సుబ్బారావు బదిలీ

ప్రజాశక్తి-కావలి

కావలి ఎంపిడిఒ అమ్మిశెట్టి వెంకట సుబ్బారావు బోగోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బదిలీ అయ్యారు. ఎంతో నిజాయతీ పరుడుగా పేరు తెచ్చుకొని కావలి అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారు.

ఎఎన్ఎంలతో ఎంపిడిఒ సమీక్ష

ప్రజాశక్తి-సంగం

ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ గోపి మండలంలోని సచివాలయ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్, ఎఎన్ఎంలతో శుక్రవారం సంక్షేమ పథకాల అమలు తీరు, పలు అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుష్మాన్ భారత్ ఈకెవైసి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో 6 సంవత్సరాల పిల్లల ఎత్తు బరువులను పరిశీలించే కార్యక్రమాన్ని 10వ తేదీ లోపు పూర్తి చేయాలని సూచించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవన్ జ్యోతి భీమా యోజన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిలక్ష్మి మృతి

ప్రజాశక్తి-నెల్లూరు



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్ రావు సోదరి ఉద్దండి ఆదిలక్ష్మి (60) శుక్రవారం మధ్యాహ్నం గుండె పోటుతో మరణించారు. జిల్లాలోని అన్ని ఉద్యోగ సంఘాల నాయకులు సుధాకర్ రావుని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దేవిరెడ్డి రమణారెడ్డి, బి కమల్ కిరణ్, ఎ.హరిబాబు, కల్పం శ్రీనివాసులు, మల్లంపూడి సతీష్ రెడ్డి, ఎం.బాలరాజన్ తదితరులు పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు.

రిజిస్ట్రేషన్ ఛార్జీలపై సిపిఐ తీవ్ర ఆగ్రహం

ప్రజాశక్తి-కావలి




మాట్లాడుతున్న నాయకులు

రాష్ట్రంలో భూములు, రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపును బేషరతుగా ఉపసంహరించుకోవాలని సిపిఐ ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బలిజేపల్లి వేంకటేశ్వర్లు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దమ్ము దర్గాబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎపి సిఎం జగన్ మోహన్ రెడ్డి నిత్యావసర వస్తువులు, భూముల ధరలు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచడమే పనిగా పెట్టుకున్నాడని విమర్శించారు. ఇప్పటికే డీజిల్, పెట్రోల్ ధరల్లో పక్క రాష్ట్రాలకంటే ఎపిలో లీటరుకు రూ.10 ఎక్కువగా వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఎపిలో వ్యాట్‌ను విపరీతంగా పెంచారని, దీంతో ఆస్తి పన్నులు, ఇంటి ట్యాక్స్‌లు, నీరు, చెత్త పన్నులు, తిండి గింజల ధరలు వూహించని విధంగా పెరిగిపోయాయని విమర్శించారు. సామాన్య ప్రజలు కష్టపడి సంపాదించుకున్న సొమ్ముతో 10 గజాల స్థలం కొనాలంటే రిజిస్ట్రేషన్ ఛార్జీలకు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఏకరువు పెట్టారు. వైసిపి అధికారంలోకి వచ్చాక విపరీతంగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల నేపథ్యంలో సామాన్య, మధ్యతరగతి కుటుంబాల ప్రజలు కనీసం రెండు పూటలా తిండి తినే పరిస్థితి లేకుండా పోతుందని విరుచుకుపడ్డారు. గ్రామ పంచాయతీలు మొదలుకొని మండలాలు, పట్టణాలు, నగరాల్లో అన్నిరకాల భూములకు ధరలు పెంచి సామాన్యులు కనీసం సెంటు స్థలం కొనే పరిస్థితి లేకుండా చేశారని సిఎం జగన్‌పై మండిపడ్డారు. వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాలపై పెద్ద ఎత్తున ధరలు పెరగడమే కాకుండా రిజిస్ట్రేషన్ చార్జీలకు భయపడి ఆయా భూములు, స్థలాలు సామాన్య ప్రజలు కొనే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికే వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువులు, సిమెంట్, స్టీలు, ఇసుక ధరలు ఊహించని విధంగా పెరిగి పోయాయని దీంతో సామాన్య ప్రజలు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగేళ్లలో 5 సార్లు ధరలు పెంచిందని జూన్ ఒకటి నుండి మరోసారి భూముల ధరలు పెంచడంతో ప్రజల నెత్తిన గుదిబండ మోపినట్లేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది చాలదన్నట్లుగా నాలుగేళ్ల కాలంలో 7సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని సామాన్య, మధ్యతరగతి కుటుంబాల ప్రజలు ఎన్నాళ్లు ధరల భారం మోయాలని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. రాజస్థాన్ రాష్ట్రంలో వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.500 ఉంటే, ఎపిలో రూ.1250 వసూలు చేస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారని, జగన్ ప్రభుత్వం యథేచ్ఛగా ప్రజలను దోచుకుంటోందని దుమ్మెత్తి పోశారు. కర్ణాటక రాష్ట్రంలో గ్యాస్ సిలిండర్‌పై సబ్సిడీ ఇచ్చి ప్రజలకు కొంతైనా ఊరట కలిగిస్తుంటే ఎపిలో జగన్ ప్రభుత్వం రేట్లు పెంచి ప్రజల నడ్డి విరిచేస్తోందని ఘాటుగా విమర్శించారు. సిఎం జగన్ ధరలు విపరీతంగా పెంచి ఎపి ప్రజల రక్తాన్ని జలగలా పీల్చేస్తున్నాడని తూర్పారబట్టారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి తక్షణమే పెంచిన రిజిస్ట్రేషన్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

మందకృష్ణ మాదిగతోనే ఎస్‌సి వర్గీకరణ

ప్రజాశక్తి-మర్రిపాడు



మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో గత 29 సంవత్సరాలుగా ఎస్‌సి వర్గీకరణే ధ్యేయంగా పని చేస్తుందన్నామని, ఆయనతోనే ఎస్‌సి వర్గీకరణ సాధ్యమని ఎంఎస్‌పి జిల్లా కన్వీనర్ పందిటి అంబేద్కర్‌మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి మండల విస్తృత స్థాయి సమావేశం ఎంఎస్‌పి సీనియర్ నాయకులు బొద్దుకూరు మహేష్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథులు గా ఎంఎస్‌పి జిల్లా కన్వీనర్ పందిటి అంబేద్కర్ మాదిగ పాల్గొని మాట్లాడారు. తాము అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎస్‌సి వర్గీకరణ చేస్తామని చెప్పిన బిజెపి ప్రభుత్వం మాదిగలను నమ్మించి మోసం చేసిందన్నారు. వర్గీకరణపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైస్ జగన్మోహన్ రెడ్డి తమ స్పష్టమైన వైఖరిని తెలియజేయాలని ఆయన డిమాండ్ చేశారు. రెండు తెలుగు రాష్ట్రల ముఖ్యమంత్రులు, దేశ ప్రధాని మాదిగలను మోసం చేశారని ఇప్పటికైనా ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని లేదంటే మాదిగల సత్తా ఏమిటో మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో జూలైలో లక్షలాది మంది మాదిగలతో జరుగబోవు సభతో నిరూపిస్తామని తెలిపారు. అనంతరం నూతన మండల కమిటీలను ఏర్పాటు చేశారు. అనంతరం ఎంఆర్‌పిఎస్ మండలం నూతన అధ్యక్షులుగా బోటిక శ్రీనివాసులు మాదిగ, అధికార ప్రతినిధి మంచాల తిరుపతి మాదిగ, ప్రధాన కార్యదర్శి కుంట మల్లికార్జున మాదిగ, కార్యదర్శి పట్నం వెంకటేష్ మాదిగను ఎన్నుకున్నారు. ఎంఎస్‌పి మండల కన్వీనర్‌గా సోంపల్లి హజరత్ మాదిగ, కోకన్వీనర్లుగా పోలిచర్ల రామయ్య మాదిగ, నాగిపోగు రమేష్ మాదిగ, నల్లిపోగు అంకయ్య మాదిగ, కన్నెమరకల తిరుపతి మాదిగ, మాదిగ మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలుగా వడ్లపల్లి రమణమ్మ మాదిగలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి సీనియర్ నాయకులు రాష్ట్ర మహిళా సమాఖ్య నాయకురాలు లక్ష్మమ్మ, ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు తాడిపత్రి లక్ష్మయ్య మాదిగ, ధుడ్డుబాబు మాదిగ, పి.పెంచలయ్య మాదిగ, నల్లిపోగు చిన్నయ్య, వెంగయ్య బొదుకూరు రఘు మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

జెవివి ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

డాక్టర్ జెట్టి శేషారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రామచంద్రారెడ్డి హాస్పిటల్ ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ ఎంవి రమణయ్య వైద్య శిబిరంలో పాల్గొని షుగర్, బిపి, పక్షవాతం వ్యాధులకు వైద్య శిబిరం వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. 4వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు రైతు శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరు జెవివి మండల శాఖ ప్రకటనలో తెలియజేశారు. అతి తక్కువ ఖర్చుతో షుగర్ పరీక్ష రూ.25, ఇన్సులిన్ రూ.80 రెండు నెలలకు సరిపోవు మందులు కేవలం రూ.200 బిపి పరీక్ష ఉచితం వైద్య సేవలో ఉచితం అని తెలిపారు. ఆదివారం 4వ తేదీ సాయిరాం కాలేజీ ప్రాంగణంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు, అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఎంపిడిఒ పరిశీలన

ప్రజాశక్తి-అల్లూరు

మండల కేంద్రంలోని అరుంధతీయవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఎంపిడిఒ శ్రీదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నట్లు వివరించారు. అలాగే 0 నుండి 5 సంవత్సరాల పిల్లల బరువును పరిశీలించి పలు సలహాలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరీ, అంగన్‌వాడీ టీచర్ ఉషారాణి తదితరులున్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : 10వ తేదీ లోపు చిన్నారుల వివరాలను యాప్లో నమోదు చేయాలని ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక యాదవ్‌పాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల ఎత్తు, బరువు, ఆరోగ్య పరిస్థితి పౌష్టికాహార పంపిణీని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు 10వ తేదీ లోపు చిన్నారుల ఎత్తు, బరువు, ఆరోగ్య పరిస్థితి పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీల ప్రత్యేక యాప్లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం రికార్డులను పిల్లల హాజరు శాతాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త చాన్‌బేగం, సచివాలయ సిబ్బంది నారాయణ పాల్గొన్నారు.

పలు గ్రామాలు ఎంపిక

ప్రజాశక్తి-ఉదయగిరి

అమృత్ సరోవరం ప్రాజెక్టు కింద పలు గ్రామాలు ఎంపికైనట్లు జిల్లా డ్వామా ఎపిడి గాయత్రి తెలిపారు. శుక్రవారం ఉదయగిరిలోని మండల పరిషత్ కార్యాలయంలో సీతారాంపురం ఉదయగిరి మండలాల ఉపాధి హామీ సిబ్బందితో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకం కింద ఆయా గ్రామాల్లో నీటి నిల్వలు వృద్ధి చేసేందుకు పలు గ్రామాలలో ఎంపిక చేశామన్నారు. సిబ్బంది వర్క్ రికార్డులు ఫీల్డ్ నేమ్ బోర్డులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం కడనూతల గ్రామంలో ఉన్న ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో యోగా, మేడిటేషియన్‌పై అవగాహన కార్యక్రమాన్ని నెల్లూరు నెహ్రూ యువ కేంద్రం వారి సహకారంతో ప్రియదర్శిని మహిళా మండలి షేక్ ఖాదర్‌బీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. జిల్లా నెహ్రూ యువ కేంద్రం జిల్లా యూత్ కో ఆర్డినేటర్ మహేందర్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రాజరెడ్డి, యోగా టీచర్ స్వర్ణ లత, కళాశాల హెచ్ఒడి లక్ష్మీ, క్రిష్ణవేణి, ఎన్ఎస్ఎస్ అధికారులు కిరణ్ కుమార్, జగదీష్, సురేష్, షభాని, బి,రహీమ్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు ఎండి అబ్దుల్ అలీమ్, జాగో వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు ఎస్.కె.జమీర్, టిపిఎస్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు టి.వెంకటేశ్వర్లు, ఆపద్బాంధవా సేవా ట్రస్ట్ అధ్యక్షులు .మధుసూదన రావు, హ్యాపీ సేవాసంస్థ అధ్యక్షులు ఎస్‌డి. ఘనిబాషా, టైమ్ టు హెల్ప్ రమేష్, గుడ్‌మెన్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు రాధ, స్టూడెంట్స్, కళాశాల స్టాఫ్ మొదలగువారు పాల్గొన్నారు.

జగనన్న గృహాలను పూర్తి చేయాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

జిల్లాలో జగనన్న గృహాల లక్ష్యాన్ని పూర్తి చేయాలని జిల్లా హౌసింగ్ పీడీ నరసింహం పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా పేదలకు గృహాలు నిర్మిస్తుందని అందులో భాగంగా జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు 86 వేల 241 గృహాలను అందించుతుందన్నారు. జిల్లా కలెక్టర్ హరినారాయణన్ జిల్లాలోని లేఅవుట్లకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఎలక్ట్రికల్ ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలకు ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. విద్యుత్ నీటి సదుపాయం కల్పిస్తారని ప్రతిఒక్కరూ బాధ్యతగా ఇల్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులను కోరారు. కొన్ని ప్రాంతాల్లో లేఅవుట్లు శ్మశానాలకు దగ్గరగా ఉండడంతో 13 వేల 124 మంది ఇంకా గృహ నిర్మాణాలు ప్రారంభించలేదన్నారు. వీరికి అవగాహన కల్పించి త్వరలో నిర్మాణాలు ప్రారంభించేలా అవగాహన కల్పిస్తామన్నారు. పునాదుల నిర్మించుకొని లబ్ధిదారులు ఉచితంగా ఇసుక పొందవచ్చన్నారు. జిల్లాలో 34 వేల 482 గృహాలు పునాదుల స్థాయిలో ఉన్నాయని బేస్‌మట్టం స్థాయిలో 19850 రూ ఫ్లేవర్ లో 3138 స్లాబులు 3170 పోసారని తెలిపారు. 8400 గృహాలు పూర్తయ్యాయని లబ్ధిదారులు గృహ ప్రవేశం కూడా చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఒక ఇంటికి రూ.1,80,000 మంజూరు చేయడమే కాకుండా 0 వడ్డీతో ప్రభుత్వం మరో రూ.35000 లోను ఇస్తుందని, మున్సిపాలిటీ ప్రాంతాల్లో రూ.35000 లోను మంజూరు చేస్తున్నారు. మే, జూన్, జూలైలో ఇల్లు నిర్మించుకునేందుకు అనుకూల వాతావరణం ఉంటుందన్నారు. అనంతరం శకునాలపల్లి సచివాలయం రికార్డులను పరిశీలించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.ఐజాక్ ప్రవీణ్, హౌసింగ్ ఏఈ రామకృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు హర్షవర్ధన్, చిన్నరాయుడు, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

విద్యార్థులు విద్యార్థి దశ నుండి పుస్తక పఠనం అలవర్చుకోవాలని గ్రంథాలయ ఇన్‌ఛార్జి శ్రీనివాసరాజు అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలలో భాగంగా శుక్రవారం ఆత్మకూరు శాఖా గ్రంథాలయంలో హాజరైన విద్యార్థులతో పుస్తకాలు చదివించడం, కథలు, డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్, పాటలు, క్యారమ్స్ తదితర నృత్యాలను నిర్వహించారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులకు రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వర్లుతో పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. అనంతరం పిల్లలకు బిస్కెట్ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. లైబ్రేరియన్ ఓంకారం శ్రీనివాసరాజు, రికార్డ్ అసిస్టెంట్ యల్. తనూజ, పాఠకులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వృద్ధురాలి మృతి

ప్రజాశక్తి-కొడవలూరు

గుర్తుతెలియని వృద్ధురాలు కొడవలూరు తలమంచి రైల్వే స్టేషన్‌ల మధ్య ఎగువ లైన్‌లో రైలు కిందపడి శుక్రవారం మృతి చెందారు. ఆమె నీలిరంగు చీర గుండు చేయించుకుని ఉన్నారు. ఆమె వద్ద ఆర్‌టిసి రెండో డిపో పల్లె వెలుగు బస్సు టికెట్లు ఉన్నాయని రైల్వే పోలీసులు తెలిపారు. ఆమె వయసు 65 నుంచి 70 సంవత్సరాల మధ్య ఉండవచ్చని, ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానిస్తున్నామన్నారు. ఆచూకీ తెలిపిన వారు రైల్వే పోలీస్ ఫోన్ నెంబర్ 9440627648 కు సమాచారం ఇవ్వాలని కోరారు.

కంటైనర్‌ను ఢీకొన్న ట్రావెల్ బస్సు

- ఇద్దరికీ తీవ్రం, ఐదుగురికి స్వల్ప గాయాలు
- మృత్యువాత పడ్డ గొర్రెలు

ప్రజాశక్తి-కొడవలూరు



కంటైనర్‌ను ఢీకొన్న బస్సు

కొడవలూరు హఠాత్తుగా ఆగిన కంటైనర్‌ను ట్రావెల్ బస్సు ఢీకొంది ఈ ప్రమాదంలో బస్సులోని ఏడుగురు గాయపడ్డారు. ఈ సంఘటన కొడవలూరు మండలం నాయుడుపాలెం జాతీయ రహదారి పై శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. గొర్రెలతో వలస వచ్చిన వారు గురువారం రాత్రి నాయుడుపాలెం వద్ద జాతీయ రహదారి పక్కనున్న ఖాళీ స్థలంలో గొర్రెలను తోలి అక్కడే నిద్రించారు. శుక్రవారం వేకువజామున 4.30 గంటల ప్రాంతంలో ఖాళీ స్థలంలోని గొర్రెలు రోడ్డుపైకి వచ్చేసాయి రోడ్డుపైన ఉన్న గొర్రెలను గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఏడు గొర్రెలు మృత్యువాత పడగా మృతి చెందిన గొర్రెలను కాపరి పక్కకు తొలగించే ప్రయ త్నం చేస్తున్నారు. ఇంతలో కావాలి వైపు నుంచి వస్తున్న కంటైనర్ వాహనం డ్రైవర్ రోడ్డుపై పడి ఉన్న గొర్రెలను మనుషులుగా భ్రమించి హఠాత్తుగా బ్రేక్ వేసి రోడ్డుపైనే నిలిపారు దీని వెనుక వేగంగా వస్తున్న విశాఖపట్నం - బెంగళూరు ట్రావెల్ బిగ్ బస్సు వేగం అదుపుకాక హఠాత్తుగా రోడ్డుపై ఆగిన కంటైనర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులోని ఐదుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ ఇద్దరికీ శస్త్ర చికిత్స చేశారు. వీరికి ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపినట్లు ఎస్ఐ జి.సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

డాక్యుమెంట్లు పోయినవి

ముక్కాల ద్వారకనాథ్, తండ్రి **ముక్కాల సత్యనారాయణ,** డోర్ నెం: 2-291 రు, చుండూరు వారి వీధి, నవాబుపేట, నెల్లూరు నగరం, నా ఒరిజినల్ డాక్యుమెంట్స్ నెం: **4623/2018** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, నెల్లూరు రూరల్ మండలం, అల్లీపురం గ్రామ పంచాయితీలో చేరిన అల్లీపురం గ్రామం, నా ఒరిజినల్ డాక్యుమెంట్స్ జెరాక్స్ తీసుకొని వస్తుండగా మార్గమధ్యలో పోయినవి. దొరికినవారు ఈ క్రింది ఫోన్ నెంబరుకు ఫోన్ చేయగలరు.

98854 77777